గృహయోగం ఎప్పుడో.. కూటమి గ్రహణం వీడెదెన్నడో !

- అటు టిడ్కో.. ఇటు జగనన్న లేఅవుట్‌లో నిలిచిన గృహ నిర్మాణాలు
- కూటమి ప్రభుత్వంలో నత్తనడకతో పోటీ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

మార్కాపురం:

కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు కావస్తున్నా గృహ నిర్మాణాలు నత్తనడకతో పోటీపడుతున్నాయి. ఒక వైపు టిడ్కో ఇళ్ల నిర్మాణం.. మరో వైపు జగనన్న లే అవుట్‌లలో ఇంటి నిర్మాణాలు నత్తనడకతో పోటీపడుతున్నాయి. దీనితో సొంతింటి కల నెరవేరే సూచనలు కనిపించడం లేదు. మార్కాపురం పట్టణంలోని నాగులవరం రోడ్డులో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 912 మందికి ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఇందుకోసం నాటి ప్రభుత్వం రూ.62.2 కోట్లను కేటాయించింది. 80 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలోనే సుమారు రూ.47 కోట్ల చెల్లింపులు జరిగాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు మందకొడిగా సాగుతున్నాయి. ప్లాట్లు పొందిన లబ్ధిదారులు ఇళ్లనిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురుచూస్తున్నారు. ఇక్కడ ఇంకా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది.


నిర్మాణంలో ఉన్న టిడ్కో భవనాలు

జగనన్న లేఅవుట్లు కూడా అంతే..

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి 15 నెలలు కావస్తున్నా సొంతింటి కల నెరవేరడం లేదు. శ్రావణ మాసం నాటికి గృహప్రవేశాలు చేయించాలనే లక్ష్యంగా పెట్టుకున్నా లక్ష్యం నెరవేరలేదు. దీనితో ఈ గడువును మళ్లీ పొడిగించారు. 2019, 2014 మధ్య కాలంలో ఇళ్ల లబ్ధిదారులకు స్వర్ణయుగం. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో వేలాది మందికి పట్టాలు ఇచ్చి గృహాలు మంజూరు చేశారు. సొంతిల్లు కావాలంటే సచివాలయానికి వెళ్లి దర ఖాస్తు చేసుకుంటే సిబ్బంది పరిశీలించి మంజూరు చేసేవారు. ఇంటి నిర్మాణానికి 1.80 లక్షల నగదుతోపాటు అవసరమైతే బ్యాంకు ద్వారా ఆర్థిక సాయం చేయించారు. అనంతరం గృహ ప్రవేశాలు జరిగాయి.


మధ్యలో నిలిచిన ఇడుపూరు లే అవుట్ గృహ నిర్మాణాలు

నియోజకవర్గంలో ఇలా..

మార్కాపురం నియోజకవర్గంలో మొత్తం 55 లే అవుట్లను ఏర్పాటు చేశారు. మార్కాపురం టౌన్, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలం, పొదిలి టౌన్‌లలో ఈ లేఅవుట్లు ఏర్పాటయ్యాయి. అన్నీ కలిపి 8,951 గృహాలు మంజూరు కాగా 3,725 గృహాలు పూర్తయ్యాయి. 2,756 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన గృహాలు ప్రారంభం కాలేదు. మార్కాపురం టౌన్‌లో మొత్తం 4 జగనన్న లేఅవుట్లు ఉండగా 6029 గృహాలు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటివరకూ 1800 గృహాలు పూర్తయ్యాయి. 878 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉండగా మిగిలినవి ప్రారంభం కాలేదు.

కారణాలు ఇవే...

ఇసుక, సిమెంటు, కంకర, ఇటుకల ధరలు పెరిగిపోవడంతో పాటు కూలీ ఖర్చులు పెరిగాయి. ఈ నేపథ్యంలో గృహ నిర్మాణాలు వేగంగా జరగలేదు. మరోవైపు అధికారులపై రాష్ట్ర గృహ నిర్మాణశాఖ అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఇల్లు కట్టుకునే విధంగా ప్రోత్సహించాలని చెప్పన్నప్పటికీ ఆర్థిక కారణాలతో పలువురు వెనకడుగు వేస్తున్నారు. దీనితో మళ్లీ గృహ ప్రవేశాలుఎప్పుడు జరుగుతాయోనని అటు అధికారులు ఇటు లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

క్లుప్తంగా

అమ్మవారి పూజల్లో జంకె


పూజలు చేస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: దసరా నవరాత్రుల్లో భాగంగా స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి గురువారం ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనస్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించి సన్మానించారు. ఆయన వెంట పార్టీ నాయకులు పంబి వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సాంబశివారెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాల కోసం భూమిని పరిశీలించిన సబ్‌కలెక్టర్


స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్, తహశీల్దార్

మార్కాపురం: మండలంలోని పెద్ద యాచవరం గ్రామంలో ఉన్నత పాఠశాలకు అవసరమైన స్థలం కోసం గురువారం సబ్‌కలెక్టర్ త్రివినాగ్, తహశీల్దార్ చిరంజీవి పరిశీలించారు. సర్వే నంబరు 20-1సి2లో ఉన్న ఐదెకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఎలిమెంటరీ పాఠశాలను 2023లో అప్‌గ్రేడ్ చేసూత ఉన్నత పాఠశాలగా మార్చారు. 215 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో నాలుగు తరగతి గదులు మాత్రమే ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు తెలపడంతో ఆయన సిబ్బందితో కలిసి స్థల పరిశీలన చేశారు.

పెట్రోల్ కల్తీ చేస్తే కఠిన చర్యలు

మార్కాపురం టౌన్: పెట్రోల్, డీజిల్ కల్తీ చేసి అధిక.దరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ హెచ్చరించారు. గురువారం ఆయన తహశీల్దార్ చిరంజీవితో కలిసి పట్టణంలోని పలు పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. పెట్రోల్ క్వాలిటీని పరిశీలించారు. వినియోగదారులకు అందిస్తున్న ధరలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన పెట్రోల్ అందించాలని నిర్వాహకులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: ఆర్‌డీఎస్ఎస్ పనుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లుగా విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని యర్రపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాలలో నూతన విద్యుత్ లైన్లు వేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని తెలిపారు.

రేషన్ దుకాణాల తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి

కొమరోలు: మండలంలోని రేషన్ దుకాణాలను తహసీల్దార్ భాగ్యలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. కొమరోలులోని 1, 2 రేషన్ దుకాణాలను తనిఖీ చేసి సంబంధిత డీలర్లను అడిగి వివరాలను తీసుకున్నారు. ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మండలంలో రేషన్ దుకాణాలలో సమయపాలన పాటిస్తూ రేషన్ సరుకులను లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. ప్రతి నెలా 24 నుంచి 30వ తేది వరకు వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటింటి రేషన్ పంపిణీ చేయాలన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

తర్లుపాడు: మండల నూతన ఎంపీడీవోగా ఓ అన్నమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని పంచాయతీ సెక్రటరీలు, ఆఫీస్ స్టాఫ్, గ్రామ సచివాలయం సిబ్బంది ఆమెకు బొకేతో స్వాగతం పలికారు. అనంతరం పంచాయితీ సెక్రటరీలతో ఆమె సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా అన్నమ్మ వెలిగండ్ల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ ప్రమోషన్‌పై తర్లుపాడుకు వచ్చారు.




బేస్తవారిపేట: గజలక్ష్మీదేవిగా కోటసత్యమాంబదేవి


బేస్తవారిపేట: బాలత్రిపురసుందరీదేవిగా చౌడేశ్వరీదేవి


గిద్దలూరులో కనకదుర్గమ్మ ఆలయంలో కాత్యాయని అలంకరణలో అమ్మవారు


కూష్మాండ దుర్గగా జగదాంబ అమ్మవారు

గజలక్ష్మీదేవిగా కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గంలో పలు ఆలయాల్లో అమ్మవారిని దసరా శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం ప్రత్యేక అలంకరణలు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా, సోమవారిపేటలోని చౌడేశ్వరీదేవిని బాలత్రిపురసుందరీదేవిగా, కోటసత్యమాంబదేవి ఆలయంలో గజలక్ష్మీదేవిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. త్రిలోక పుణ్యక్షేత్రం, పాపాయిపల్లె, బేస్తవారిపేటలోని పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేక అలంకరణలు చేశారు.

అన్నపూర్ణాదేవీగా వాసవీమాత

మార్కాపురం టౌన్: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీమాతను అన్నపూర్ణాదేవీగా అలంకారం నిర్వహించారు. గురువారం దేవీ నవరాత్రుల్లో భాగంగా పలు దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం నిర్వహించగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు ధాన్యలక్ష్మిగా, శివాలయంలో జగదాంబ అమ్మవారు కూష్మాండదుర్గగా, అమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో గాయత్రీ దేవీగా, నాగేంద్ర కనక దుర్గమ్మ ఆలయంలో వైష్ణవీమాతగా అలంకారం నిర్వహించారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు, పెదారికట్ల, కొనకనమిట్ల, రేగడపల్లి గ్రామాలలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవోపేతంగా అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నారు. గురువారం వాసవీదేవిని కాత్యాయనిదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.


గాయత్రీ దేవీగా అమ్మవారు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయంలో, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం , రేడియో బావి సమీపంలో గల కాళికామాత ఆలయం, కాశినాయకుంట ఆలయంలో గాయత్రిమాత ఆలయాల్లో గురువారం అమ్మవారు కాత్యాయనిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. షరాబ్ బజారులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, రాచర్లరోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో దసర మహోత్సవాలను పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు.


గొట్లగట్టులో కాత్యాయనిదేవిగా..

కొమరోలు: కొమరోలులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు భక్తులకు బాలత్రిపురసుందరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

రణభేరికి తరలిన ఉపాధ్యాయులు


గుంటూరు వెళ్లిన ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు


రైలులో తరలివెళ్తున్న కొమరోలు యూటీఎఫ్ నాయకులు

మార్కాపురం: ఆర్థిక, విద్య, ఉపాధ్యాయ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన రణభేరీ కార్యక్రమానికి గురువారం మార్కాపురం ప్రాంతం నుంచి సుమారు 100 మందికి పైగా ఉపాధ్యాయులు రైలులో బయలుదేరి వెళ్లారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జయరామిరెడ్డి, రాజేష్, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించబోయే రాష్ట్ర రణభేరి కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ మండల అధ్యక్షుడు మొర్రి పిచ్చయ్య యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, శవప్రసాద్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు నుంచి..

కొమరోలు: ప్రభుత్వ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గుంటూరులో సెప్టెంబరు 25 నుంచి 5 రోజులపాటు రణభేరి కార్యక్రమానికి కొమరోలులోని ప్రభుత్వ ఉపాధ్యాయులు పలువురు తరలివెళ్లారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సి.హెచ్.క్రిష్టారెడ్డి, ఓబయ్య, బాలయ్య, రాములు, శ్రీనివాసరెడ్డి, వై.వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తిచేయాలి


వివరాలను తెలుసుకుంటున్న జేసీ గోపాలకృష్ణ, పక్కన సబ్‌కలెక్టర్

మార్కాపురం: జల్‌జీవన్ మిషన్ పనులను త్వరగా పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. గురువారం మార్కాపురం మండలంలోని గొట్టిపడియ వద్ద జరుగుతున్న ఇన్‌టెక్‌వెల్ ట్యాంకు పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేస్తే తాగునీటిని అందించవచ్చని అన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఇతర పనుల నిమిత్తం 12.5 ఎకరాల భూమి కావాలని ఇంజినీరింగ్ అధికారులు అడుగగా జేసీ, సబ్‌కలెక్టర్ కలిసి పొలాలను పరిశీలించారు. నివేదిక పంపాలని తహశీల్దార్ చిరంజీవిని ఆదేశించారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం


ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

మార్కాపురం టౌన్: మానవతా సంస్థ ఆధ్వర్యంలో మార్కాపురం ప్రాంతంలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని, నూతన అధ్యక్షులుగా ఎన్నికైన రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి తెలిపారు. పట్టణంలోని శుభం కల్యాణ మండపంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు, విద్యార్థులకు సంస్థ తరుపున సహాయ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. 43 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి అన్నా రాము, కోశాధికారి తడికమళ్ల శ్రీనివాసులు, కె యలమందారెడ్డి, సోమిశెట్టి శ్రీనివాసులు, యేసేబు, డీవీఆర్, రామాంజనేయులు, చలం, గుంటక చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో దిగుబడులు

కొనకనమిట్ల: వ్యవసాయంలో రైతులు ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్స్ డాక్టర్ జి.రమేష్, టి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని గొట్లగట్టు గ్రామంలో గురువారం దర్శి కృషి విజ్ఞాన కేంద్ర తరపున మినుము పంట సాగుచేసే రైతులకు ఉచితంగా మినుములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరాల ఆదర్శ గ్రామ పథకంలో భాగంగా గొట్లగట్టులో 350 ఎకరాలలో సాగు చేసేందుకు టీబీజీ 104 రకం విత్తనాలను కృషి విజ్ఞాన కేంద్రం తరపున రైతులకు ఇచ్చామన్నారు.

జార్జి కళాశాలలో ఘనంగా ఫార్మసీ డే


సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ సతీష్, ఉషారాణి

మార్కాపురం: ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని కళాశాల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్, మార్కాపురం డివిజన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణి అన్నారు. గురువారం జార్జి ఫార్మసీ కళాశాలలో వరల్డ్ ఫార్మాసిస్టు డే సందర్భంగా వాలెడిక్టరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకూ వస్తున్న జబ్బులకు మందులు కనుగొనాలని సూచించారు. ఒంగోలు జీజీహెచ్ ఫార్మా కాలేజీ డాక్టర్ గోకుల్, ఏకె యూనివర్సిటీ డీన్ డాక్టర్ రాజమోహన్‌రావు తదితరులు ఫార్మాసిస్టు ప్రాముఖ్యతను తెలిపారు. నార్కోటిక్ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ చాప్టర్ వింగ్ అధ్యక్షుడిగా రోసిరెడ్డి


రోసిరెడ్డి

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలోని కొనకనమిట్ల మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన ఎస్ రోసిరెడ్డిని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఐటీ వింగ్ చాప్టర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా రోసిరెడ్డిని నియమించినట్లు పార్టీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా రోసిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం


అన్నాకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ప్రతినిధులు

మార్కాపురం: యర్రగొండపాలెంలో జరగుతున్న దసరా దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించాలని యర్రగొండపాలెం ఆర్యవైశ్య కమిటీ ప్రతినిధులు గురువారం మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు ఆహ్వానపత్రికను అందించారు. దసరా నవరాత్రులు వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా దీన దయాళ్ జయంతి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం టౌన్: పండిట్ దీన దయాళ్ జయంతిని గురువారం బీజెపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీజెపి నాయకులు పీవి కృష్ణారావు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజ సేవకు ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు, ప్రవీణ్, లక్ష్మి, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం

బేస్తవారిపేట: షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. ఈ సంఘటన గురువారం స్థానిక టీచర్స్ కాలనీలోని బీఎస్ఎన్ఎల్ టవర్ పక్కన జరిగింది. వివరాల్లోకి వెళితే.. దూదేకుల మస్తాన్ ఇంటి పక్కన కొన్ని రోజులుగా కారు పార్కింగ్ చేసి పెట్టుకున్నాడు. గురువారం ఉదయాన్నే కారు స్టార్ట్ చేసే సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇంజన్‌లోంచి మంటలు వ్యాపించాయి. కారు ముందుభాగం పూర్తిగా మంటల్లో కాలిపోయింది. చుట్టుపక్కల గృహస్తులు సకాలంలో నీళ్లు చల్లి మంటలను అదుపులోకి తెచ్చారు.